క్లుప్తంగా

కలెక్టరేట్ ఆధునికీకరణ పనులు ప్రారంభం



పనుల్లో నిమగ్నమైన కూలీలు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. పనులను సీపీఓ కార్యాలయ జేడీ ఎల్ అప్పలకొండ పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కలెక్టరేట్ ఆధునికీకరణకు రూ.8.08 కోట్లను మంజూరు చేయగా, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శంఖుస్థాపన చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో మంగళవారం సీపీఓ కార్యాలయంలో జేడీ అప్పలకొండ పర్యవేక్షణలో పనులు ప్రారంభమయ్యాయి. కార్యాలయ విధులకు ఆటంకం కలుగకుండా పనులు చేపడతామని అప్పలకొండ తెలిపారు.

గుంతను పూడ్చండి



గుంత వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): పూల బజార్‌లో పైపులైన్ కోసం తవ్విన గుంతను పూడ్చక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు అబ్దుల్‌దేశాయ్, షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గుంతను తవ్విన ప్రాంతంలో తక్షణమే పూడ్చాలని సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పది రోజులు క్రితం గుంత తవ్వారని, ఇంతవరకు పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే మునిసిపల్ అధికారులు స్పందించాలని కోరారు.

ఓపీ విభాగాల తనిఖీ



ఈఎన్‌టీ ఓపీ పరిశీలిస్తున్న డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిరోజూ నిర్వహించే సాయంత్రం ఓపీ విభాగాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. మెడికల్, సర్జికల్, చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, మానసిక వ్యాధులు, ఆర్థోపెడిక్ ఓపీలను పరిశీలించి ఆయా విభాగాల్లో ఎవరెవరు వస్తున్నారని ఆరా తీశారు. సాయంత్రం గణాంకాలను తనకు పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్థో, మెడికల్, సర్జికల్ ఓపీల వద్ద చాలా మంది రోగులు వేచి ఉండటాన్ని గమనించి, వారికి సత్వరం వైద్యం అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష



బ్లూమ్ సంస్థ ప్రతినిధిని సత్కరిస్తున్న డీపీఎం చంద్రశేఖర్, తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో జరుగుతున్న పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని బ్లూమ్ సంస్థ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ లింసా జాక్ అధ్యయనం చేశారు. బుధవారం మద్దూరు నగర్‌లోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో వివిధ కేటగిరీల సిబ్బందితో ప్రకృతి వ్యవసాయం ఉద్దేశాలు, సాగు, పంట దిగుబడులు, నాణ్యతా ప్రమాణాలు తదితరవాటిపై సమీక్ష నిర్వహించారు. ముందుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఉత్పాదకత, పొలంబడి తదితర కార్యక్రమాలను డీపీఎం చంద్రశేఖర్ వివరించారు. అనంతరం బ్లూమ్ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కెమికల్స్ లేని ఉత్పత్తులు లభిస్తాయన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం లేనందున పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ లక్ష్మయ్య, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడం తగదు

కర్నూలు (న్యూసిటీ): విద్యుత్ కోతలు విధిస్తూ, మరోవైపు విద్యుత్ చార్జీలను పెంచడం తగదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని ఆరోపించారు. విద్యుత్ కోతల వల్ల వ్యవసాయ మోటార్లు కాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సీఎం స్పందించి విద్యుత్ చార్జీలు తగ్గించి, కోతలు లేని విద్యుత్‌ను అందించాలని కోరారు.

వెలుగులు నింపేవారే గురువులు

● ఘనంగా గురుపూజోత్సవం



సిల్వర్‌జూబ్లీ కాలేజీలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ, తదితరులు

విద్యార్థుల జీవితాల్లో చీకట్లు తొలగించి వెలుగులు నింపేవారే గురువులని పలువురు కొనియాడారు. భావిభారత పౌరులను తయారు చేయడంలో గురువుల పాత్ర అమోఘమన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలు చోట్ల ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీలో జరిగిన వేడుకల్లో వర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.
- అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో స్కూల్ వ్యవస్థాపకులు జి.పుల్లయ్య పాల్గొన్నారు.
- రవీంద్ర మహిళ, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీల్లో నిర్వహించిన వేడుకల్లో రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.వి.ఎం మోహన్‌కుమార్, కాలేజీ స్పెషల్ ఆఫీసర్ పాండురంగయ్య, ప్రిన్సిపాళ్లు డాక్టర్ సి శ్రీనివాసరావు, డాక్టర్ కేతఈ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.
- శ్రీరాయలసీమ క్రిస్టియన్ బీఈడీ కాలేజీలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు.
- మథర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ పాల్గొన్నారు.
- సిరాక్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన వేడుకల్లో స్కూల్ అధినేత జి.ఎం.డి ఇబ్రహీం పాల్గొన్నారు.
- స్థానిక మాధవీనగర్, రెవెన్యూ కాలనీలోని సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల్లో జరిగిన వేడుకల్లో ఆ స్కూళ్ల కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య పాల్గొన్నారు. వేడుకల్లో టీచర్లను సన్మానించారు.
- మాధవ నగర్‌లోని నారాయణ స్కూల్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ పాల్గొన్నారు. మహిళ టీచర్ల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.
- ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- ఎస్టీబీసీ డిగ్రీ కాలేజీలోని వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ ప్రశాంతి శ్యాం పాల్గొన్నారు.
- కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.
- ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.
- విజ్ఞాన పీఠంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి గురుమూర్తి, ప్రధానోపాధ్యాయులు వ్యాసరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు బోధనాసుపత్రిలో చదివే వైద్య విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆచార్యులపై ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో ..



రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపకులపతి ఆనందరావు, అధ్యాపకులు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనన్నారు. కాలానుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేయాలని గురువులకు సూచించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, వివిధ విభాగాల ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉర్దూ విశ్వవిద్యాలయంలో..



సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉర్దూ ఉపకులపతి ఆచార్య ఫజలుర్ రహమాన్, అధ్యాపకులు

స్థానిక ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఉపకులపతి ఆచార్య ఫజలుర్ రహమాన్ సూచించారు.

అవయవ దానంలో ఆర్యవైశ్యులు



భానుమతమ్మను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): ఆర్యవైశ్యులు అవయవదానంలో ముందంజలో ఉంటున్నారని ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్‌వీ లక్ష్మీ సుజాత అన్నారు. మంగళవారం స్థానిక ఆవోపా సేవా సదన్‌లో ఆవోపా మహిళా విభాగం పక్షోత్సవ అంధత్వ నేత్రదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది మంది నేత్రదానం చేసేందుకు ముందుకొచ్చారన్నారు. గుబ్బా రామస్వామి దంపతులు సంపూర్ణ శరీర దానం చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. అనంతరం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక ప్రవచనకర్త భానుమతమ్మను, ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు మేడా రమతో పాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షులు సురేష్, కోశాధికారి మేడా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సెక్రటరీ రత్నప్రసాద్, యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య, డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(సిటీ): నగరంలోని కింగ్ మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయులు భావిభారత పౌరులను తయారు చేయాలన్నారు. పేద విద్యార్థుల కోసం సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హనుమంత రావు, హెచ్‌ఎం మౌలాలి పాల్గొన్నారు.

సచివాలయాల్లో సర్వీసులు పెంచాలి

కృష్ణగిరి: గ్రామ సచివాలయాలలో ప్రజలకు అందించే సర్వీసులను పెంచాలని కర్నూలు డివిజినల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయన మంగళవారం కృష్ణగిరి గ్రామ సచివాలయాన్ని, మండలంలోని మీ-సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకుని ప్రభుత్వ సేవలను అందులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. యాప్ ద్వారా అర్హులైన వారందరికీ రూ.5 లక్షల బీమా ఉంటుందన్నారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

యువతి అదృశ్యం



ఉషశ్రీ (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే) ఉషశ్రీ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆమె తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కర్నూలులో నివాసముంటున్న ఉషశ్రీ ప్రతిరోజులాగే సోమవారం విధి నిర్వహణకు బయలుదేరింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెంది కుటుంబ సభ్యులు పలు చోట్ల వాకబు చేశారు. మంగళవారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం ప్రారంభం

కర్నూలు కల్చరల్: ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ప్రారంభించినట్లు కర్నూలు - 1, 2 డిపోల మేనేజర్లు సర్దార్ హుస్సేన్ కె.సుధారాణి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కర్నూలు- లద్దగిరి, కర్నూలు- బేతంచెర్ల రూట్‌లో బస్సు ఎక్కిన ప్రయాణికులు వారి టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెలా 1, 16 తేదీల్లో లక్కీ డిప్ ద్వారా డ్రా తీసి ఇద్దరికి ఆకర్షణీయమైన బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లీలా మనోహరా.. జగన్నాథా!

● నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి
● ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



రుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయం

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని బుధ, గురు వారాల్లో శ్రీకృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు. వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే వేడుకల్లో శ్రీకృష్ణాష్టమి పర్వదినం ఒకటి. కర్నూలు నగరంతో పాటు, నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, పత్తికొండ, నందికొట్కూరు తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. కర్నూలు నగరంలో ఇస్కాన్, గో సంరక్షణ శాల, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, నంద్యాల చెక్‌పోస్ట్ శ్రీకృష్ణ ఆలయం, చిన్మయ మిషన్, లలితా పీఠం, చిన్నఅమ్మవారి శాల, రామిరెడ్డి తాత సంస్థాన్, సత్యసాయి మందిరం, సూర్యనారాయణ స్వామి, సత్యనారాయణ స్వామి, వీఆర్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో..

నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో బుధ, గురువారాలు(రెండు రోజుల పాటు) ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు గోమాత పూజ, 8 గంటలకు భజన, అర్ధరాత్రి 12 గంటలకు శ్రీకృష్ణ జన్మదిన వేడుకల లాలిపాటలు, 7వ తేదీ ఉదయం 6 గంటలకు శ్రీకృష్ణ, రుక్మిణీ మాత అభిషేకం, 10 గంటలకు శ్రీకృష్ణుని చిత్రపటంతో కలెక్టరేట్ నుంచి ఆలయం వరకు ర్యాలీ, 1 గంటకు ఉట్లోత్సవం, నృత్య ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

దిగువపాడు ఉప సర్పంచ్‌గా వడ్డె వెంకటలక్ష్మి



వడ్డె వెంకటలక్ష్మి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల ఆఫీసర్ రవికిశోర్

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని దిగువపాడు గ్రామ ఉప సర్పంచ్‌గా వడ్డె వెంకటలక్ష్మి (వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు స్టేజ్-2 ఆఫీసర్ (కల్లూరు ఈఓఆర్‌డీ) రవికిశోర్ వెల్లడించారు. సోమవారం కోరం లేకపోవడంతో వాయిదా పడిన విషయం విదితమే. మంగళవారం దిగువపాడు సచివాలయంలో ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. 8వ వార్డు సభ్యురాలు వడ్డె వెంకటలక్ష్మి ఉప సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ధ్రువీకరణ పత్రం అందజేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

● జీవన పోరాటం..



ఆసుపత్రి గేటు వద్ద వర్షంలో కూర్చుని వ్యాపారం చేస్తున్న పేద మహిళలు

వారిద్దరూ నిరుపేదలు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారిది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గేటు వద్ద కూర్చొని చిరువ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. ఇందులో ఒకరు ఆసుపత్రి సమీపంలోని బుధవారపేటకు చెందిన శాంత టెంకాయలు విక్రయిస్తోంది. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారు దిష్టి తీసేందుకు ఈమె వద్ద టెంకాయలు కొంటుంటారు. ఈమె ప్రతిరోజూ 30 టెంకాయల దాకా విక్రయిస్తోంది. కొన్నిసార్లు పదిహేనులోపే టెంకాయలు అమ్ముడవుతాయి. మరో మహిళ పేరు మంగమ్మ. ఈమెది కూడా బుధవారపేటనే. భర్త లేడు. కుటుంబ పోషణ కోసం వేరుశనగ విత్తనాలు ఆసుపత్రిలో విక్రయించి సొమ్ము చేసుకుంటోంది. మంగళవారం ఉదయం నుంచి వర్షం ఏకధాటిగా కురుస్తున్నా గొడుగు చేతబట్టుకుని వీరు ఆసుపత్రి గేటు వద్దే కూర్చొని ఎవరైనా రాకపోరా.. తమ వద్ద కొనుగోలు చేయకపోరా అని ఆశగా ఎదురుచూస్తూ కనిపించారు.

– కర్నూలు(హాస్పిటల్)

కళలు సంస్కృతికి ప్రతిబింబాలు



కళాకారులను సన్మానిస్తున్న మేయర్ రామయ్య, తదితరులు



అలరించిన నృత్యం

కర్నూలు కల్చరల్: కళలు మన సంస్కృతికి ప్రతిబింబాలని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు జరగనున్న శాస్త్రీయ జానపద నృత్య ఉత్సవాలను మంగళవారం రాత్రి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న జానపద కళలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. తంజావూరు దక్షిణ మధ్య ప్రాంత సాంస్కృతిక సమన్వయకర్త బి.జగన్నాథం మాట్లాడుతూ దేశంలో ఏడు సాంస్కృతిక కేంద్రాలు ఉన్నాయన్నారు. దక్షిణ భారతానికి తంజావూరు కేంద్రంగా ఉందన్నారు. ఈ కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలు ప్రజలకు మూడు రోజుల పాటు జానపద శాస్త్రీయ పౌరాణిక ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన యశోదా ఠాకూర్ కూచిపూడి నృత్యం, వరంగల్ ట్రైబల్ మాధురి నృత్యం, గద్వాల దాసరి రంగయ్య సింధు యక్షగానం ప్రదర్శనలు అలరించాయి. అనంతరం కళాకారులను మేయర్ బీవై రామయ్యతో పాటు సమన్వయకర్త డి.జగన్నాథం, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు రంగయ్య, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య సత్కరించారు.

నేటి ప్రదర్శనలు..

రెండో రోజు బుధవారం సాయంత్రం 6.30 గంటలకు మల్లిక కండలిచే అస్సాం శాస్త్రీయ నృత్యం సత్రియ, మహబూబ్ నగర్‌కు చెందిన శివ బృందం లంబాడి నృత్యం, నాగర్ కర్నూలుకు చెందిన శ్రీధర్ బృందం ఉగ్గ కథలు ప్రదర్శితమవుతాయి.

పరీక్షలకు 32 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 32 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పీజీ పరీక్షలకు ఆరు కేంద్రాలను ఏర్పాటు చేయగా 559 మందికి గానూ 537 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజుల పాటు నిర్వహించిన బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల అవగాహన సదస్సు మంగళవారం ముగిసింది. సామాజిక కార్యకర్తలు అప్పల ప్రసాద్, దువ్వూరి యుగంధర్ హాజరై ప్రసంగించారు. విభిన్న జాతులు, మతాలు, సంస్కృతులు కలిగిన దేశం భారత దేశమన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యార్థిగా ఎదిగినప్పుడే వారి జీవితానికి సార్థకత ఉంటుందన్నారు. సదస్సులో మేనేజింగ్ ట్రస్ట్ చైర్మన్ జి.రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరెడ్డి, ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

'సిటీ సబర్బన్' బస్సుల ప్రకటన అవాస్తవం

కర్నూలు కల్చరల్: నగర పరిధిలో రూ.5, రూ.10 చార్జీలతో సిటీ సబర్బన్ బస్సులు ప్రవేశ పెట్టినట్లు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో చక్కట్లు కొడుతున్న ప్రకటన అవాస్తవమని జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటరామం మంగళవారం పేర్కొన్నారు. మైసిటీ కర్నూలు వాటర్ మార్క్ పేపర్‌పై వైరల్ అయిన ప్రకటనపై ఎలాంటి తేదీ, అధికారి సంతకం లేవన్నారు. ప్రజలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న వార్తను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు.

పోస్టులను భర్తీ చేయండి

కర్నూలు(అర్బన్): గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని టీఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు అక్కులప్ప, రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప కోరారు. మంగళవారం వారు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళీని కలిసి వినతి పత్రం అందించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో సబ్జెక్టుల్లో బోధన కుంటుపడుతోందని, ఆశ్రమ, గురుకులాల్లో ఏఎన్‌ఎంలు లేక పోవడం వల్ల అత్యవసర సమయాల్లో విద్యార్థులకు వైద్య సేవలు అందడం లేదని వివరించారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్, ఉపాధ్యక్షులు రవీంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

ఆర్‌యూలో పీఎఫ్‌ఎంఎస్ శిక్షణ

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో జిల్లాలో ఉన్న ప్రైవేట్ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులకు మంగళవారం పీఎఫ్‌ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్స్ మెనేజ్‌మెంట్ సిస్టమ్)పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు మాట్లాడుతూ డేటా ఆపరేటర్, డేటా అప్రూవల్, డేటా క్రియేట్ చేసుకోవడం, డేటా ఆపరేటర్ నుంచి ఫండ్స్‌ను తీసుకోవడం, వినియోగించుకోవడం తదితర విషయాలను శిక్షణలో తెలుసుకుని విధి నిర్వహణలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ అరుణ పాల్గొన్నారు.

సకాలంలో జీతాలివ్వండి

కర్నూలు(హాస్పిటల్): సకాలంలో జీతాలివ్వాలని పెద్దాస్పత్రి సెక్యూరిటీ గార్డులు మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. మూడు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని విన్నవించారు. స్పందించిన ఆయన.. తాము జూన్ వరకు జీతాలు చెల్లించామని, ఇంకా సెక్యూరిటీ గార్డులకు అందకపోవటమేమిటని, సెక్యూరిటీ ఏజెన్సీతో మాట్లాడి జీతాలు ఇప్పించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

దొంగల ముఠా అరెస్ట్

కర్నూలు(టౌన్): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న నలుగురిని నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 2న నాగేంద్రనగర్‌లో తాళం వేసిన ఇంట్లో రూ.50 వేలు నగదు, జత కమ్మలు, జత మాటీలు చోరీకి గురయ్యాయి. ఇంటి యజమాని చింతల తిరుపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న నాల్గవ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. మంగళవారం కోడుమూరు రోడ్డులోని హోసన్నా మందిరం వద్ద అనుమానంగా తచ్చాడుతున్న గజ్జల వంశీ (వీకర్‌సెక్షన్ కాలనీ), షేక్ మహమ్మద్ (విజయకృష్ణ నగర్), ప్రకాష్ (ఎస్సీ కాలనీ, జి.శింగవరం), ఎం.వంశీ (అశోక్ నగర్)లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.40 వేలు నగదు, తులం బంగారం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.